# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 29 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## అయ్యప్ప భక్తులకు కేంద్రం శుభవార్త

- ఇరుముడితో విమాన ప్రయాణానికి అనుమతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శబరిమల అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఉపశమనం ఇచ్చింది. ఇకపై టెంకాయతో సహా ఇరుముడిని కూడా విమానంలోని క్యాబిన్ లగేజీగా తీసుకెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్లు పౌర విమానయాన శాఖ ప్రకటించింది. తాజా నిర్ణయం నవంబర్ 28 నుంచే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. భద్రతా కారణాల వల్ల ఇరుముడిని ఇప్పటి వరకు చెక్-ఇన్ లగేజీగా పంపాల్సి రావడంతో అయ్యప్ప భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులతో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు జోక్యం చేసుకుని భక్తులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. అయ్యప్ప స్వాములు టెంకాయతో సహా ఇరుముడిని క్యాబిన్ బ్యాగ్‌లోనే తీసుకెళ్లవచ్చు. భక్తుల సాంప్రదాయాలు, ఆచారాలకు భంగం కలగకుండా ఉండేలా, అలాగే భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. శబరిమల యాత్రలో ఇరుముడికి ఉన్న పవిత్రత, భావోద్వేగాన్ని గుర్తించి భక్తులకు వీలైనంత సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని మంత్రి రామ్మోహన్ నాయుడు వివరించారు.

# కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- సర్పంచ్ స్థానాలకు 8,198, వార్డులకు 11,502
- అత్యధికంగా నల్లగొండలో 974, అత్యల్పంగా ములుగులో 63



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు రెండో రోజు నామినేషన్ల పర్వం కొనసాగింది. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు సగటున ఒక్కటి కంటే తక్కువ, వార్డు మెంబర్ల స్థానాలకు సగటున 4.5 శాతం మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం పూట ముహూర్తం బాగా లేదని పలు ప్రాంతాల్లో సాయంత్రం మూడు గంటల నుంచి నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు క్యూ కట్టారు. దాంతో 5 గంటల లోపు వచ్చిన వారికి రిటర్నింగ్ అధికారులు అవకాశం కల్పించారు. రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు 4,901 నామినేషన్లు దాఖలు కాగా మొదటి రోజుతో కలిపి మొత్తం రెండు రోజుల్లో 8,198కి చేరాయి. అలాగే 37,440 వార్డులకు గాను 9,643 నామినేషన్లు దాఖలు కాగా, మొదటి రోజుతో కలిపి 11,502కు చేరాయి. సర్పంచ్ స్థానాలకు రెండు రోజుల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 796 నామినేషన్లు వేశారు. 48 స్థానాలున్న ములుగు జిల్లాలో అత్యల్పంగా 63 నామినేషన్లు వచ్చాయి. 28,70 వార్డుమెంబర్లు ఉన్న నల్లగొండలో అత్యధికంగా 974, ములుగు జిల్లాలో 93 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు సగటున రెండు చొప్పున, వార్డు మెంబర్ల స్థానాలకు సగటున కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. మారిన రాజకీయ పరిస్థితులు, అధిక వ్యయం మూలంగా పోటీ చేసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. నామినేషన్లకు నేడు చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఫ్రీ సింబల్స్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. సర్పంచ్ ఎన్నికలకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను ప్రకటించింది. సర్పంచ్ ఎన్నికల్లో మొదటి గుర్తు ఉంగరం, రెండవ గుర్తు కత్తెర కాగా, చివర రెండు గుర్తులు వరుసగా గాలి బుడగ, క్రికెట్ స్టంప్స్‌గా మొత్తం 30 గుర్తులను కేటాయించారు. వార్డు ఎన్నికల్లో మొదటి గుర్తు గౌను, రెండవ గుర్తు గ్యాస్ పొయ్యి కాగా, చివర రెండు గుర్తులు వరుసగా విద్యుత్ స్తంభం, కెటిల్‌గా మొత్తం 20 గుర్తులను కేటాయించారు. బ్యాలెట్ చివరి గుర్తు తర్వాత నోటా గుర్తు ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు ఈసీ సర్క్యూలర్ జారీ చేసింది. గుర్తు కేటాయింపు ఆల్ఫాబెటికల్ ఆర్డర్ ద్వారా చేయాలని కోరింది. ఒకే పేరుతో ఇద్దరు వ్యక్తులు ఉంటే వారి ఇంటి పేరు, నివాసాన్ని పరిగణలోకి తీసుకుని ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించాలని ఈసీ సూచించింది.

సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని ఈసీ ప్రకటించింది. ఈ మేరకు స్టేట్ ఎలక్షన్ కమిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 243 (కె) అధికారం, 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ వ్యయాలను నిర్ణయించినట్లు పేర్కొంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 50 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.1.5 లక్షలు, 50 వేలు అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన పంచాయతీల్లో పోటీ చేసే వారు రూ.2.5 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు. 50 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లు రూ.30 వేలు, 50 వేలు అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన పంచాయతీల్లో పోటీ చేసే వారు రూ.50 వేలకు మించి వ్యయం చేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజు వారి వ్యయాన్ని సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని ఆదేశించింది.

# జనవరి 1న సమూహికంగా లొంగిపోతాం

**మావోయిస్టులు ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దశాబ్దాలుగా సాగుతున్న సాయుధ పోరాటానికి తెరపడేలా మావోయిస్టులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో విడుదల చేసిన లేఖలో, 2026 జనవరి 1న ఆయుధాలను పూర్తిగా విడిచి, ఒకేసారి సమూహంగా లొంగిపోతామని ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, అంతకు ముందు హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించడం వంటి సంఘటనలతో పార్టీ బలహీనమైందని, ఇదే తమ నిర్ణయానికి ప్రధాన కారణమని లేఖలో స్పష్టం చేశారు. మిగతా దళాలు కూడా సమాజంలో కలిసిపోవాలంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

"మావోయిస్టు దళాలు ఒక్కొక్కరిగా కాదు, అందరం ఒకేసారి లొంగిపోతాం" అని లేఖలో పేర్కొన్నారు. ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించి, అందిస్తున్న పునరావాస పథకాలను అంగీకరిస్తామని తెలిపారు.

లొంగుబాటు చేపట్టే రాష్ట్రం సహకారం కీలకమని, తాము సహకరించే రాష్ట్రంలోనే లొంగిపోవడానికి సిద్ధమని మావోయిస్టులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ సమూహ లొంగుబాటు పూర్తయ్యే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సంయమనం పాటించాలని, ఎలాంటి కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించవద్దని కోరారు. గత వారం కూడా మావోయిస్టులు లేఖ ద్వారా జనజీవన స్రవంతిలో కలిసేందుకు కొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వాలను అభ్యర్థించిన విషయం తెలిసిందే. ఈ తాజా ప్రకటనతో, మావోయిస్టుల సాయుధ పోరాటం ముగింపు దశలోకి అడుగుపెట్టినట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.

# భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదు



**బలగం టీవీ, ఉడుపి**

దేశ భద్రత విషయంలో నూతన భారత్ ఎలాంటి బెదిరింపులకూ తలవంచదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రదాడులు జరిగిన తర్వాత గత ప్రభుత్వాలు నిర్లిప్తంగా వ్యవహరించేవని విమర్శిస్తూ, దేశ పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా ముందుకు వెళ్లే సంకల్పం తమ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కర్ణాటకలోని ఉడిపిలో నిర్వహించిన లక్షకంఠ గీత పారాయణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన సుదర్శన చక్ర మిషన్ రాబోయే దశాబ్దానికి భారత జాతీయ భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యమని మోదీ తెలిపారు. "యుద్ధభూమిలో శ్రీకృష్ణుడు ఇచ్చిన గీతా బోధనలోని ధర్మరక్షణ సిద్ధాంతమే మా జాతీయ భద్రతా విధానం. శత్రువులు భారత్‌పై దాడి చేయాలన్నా ధైర్యం చేయలేరు. చేసినా వారిని సుదర్శన చక్రంలా సమూలంగా నాశనం చేస్తాం" అని వ్యాఖ్యానించారు.

పహల్గాం ఉగ్రదాడిలో కర్ణాటకకు చెందిన పౌరులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత, ప్రతీకారం తీర్చుకునేందుకు ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ను ప్రధాని మరోసారి ప్రస్తావించారు. "మునుపటి ప్రభుత్వాలు ఉగ్రదాడుల తర్వాత ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆలోచన కూడా చేసేవి కాదు. కానీ ఇది కొత్త భారత్. శాంతిని స్థాపించడం, దానిని కాపాడడంలో మేము వెనుకాడం" అని మోదీ తెలిపారు. పాకిస్తాన్ ముష్కరులు హిందువులను లక్ష్యంగా చేసుకుని పహల్గాంలో చేసిన దాడిలో 26 మంది మరణించిన సంగతి తెలిసిందే. అనంతరం భారత సైన్యం మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి, పాక్%-పీవోకేలోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఉడిపిలో జరిగిన ఈ మహా యజ్ఞానికి విద్యార్థులు, సాధువులు, పండితులు, వివిధ రంగాల ప్రజలు సహా లక్ష మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కృష్ణమందిరి ముందనున్న సువర్ణ తీర్థ మండపాన్ని ప్రారంభించారు. అదేవిధంగా, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న కనకన కిండి కోసం తయారు చేసిన బంగారు కవచాన్ని అంకితం చేశారు. ఈ కిటికీ ద్వారానే కనకదాసు శ్రీకృష్ణుని దివ్య దర్శనం పొందినట్లు భక్తుల నమ్మకం.

# ప్రపంచంలోనే ఎత్తైన శ్రీరాముడి కాంస్య విగ్రహం ఆవిష్కరణ

- గోవా పర్తగాలీ జీవోత్తమ్ మఠంలో 77 అడుగుల ప్రతిష్ఠ



**బలగం టీవీ, పనాజీ**

దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠంలో ప్రతిష్ఠించిన 77 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శ్రీరాముడి విగ్రహంగా నిలిచింది. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ అశోక్ గజపతిరాజు, సీఎం ప్రమోద్ సావంత్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. "భారత్ అద్భుతమైన సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని చూస్తోంది. అయోధ్యలో రామమందిరం, వారణాసిలో కాశీ విశ్వనాథ్ ధామ్, ఉజ్జయినిలో మహాకాళ్ కారిడార్ అభివృ ద్ధితో ఆధ్యాత్మిక వారసత్వం మరింత బలోపేతమైంది" అని పేర్కొన్నారు. "ఎన్ని యుగాలు మారినా, ఈ మఠం తన లక్ష్యాన్ని మర్చిపోలేదు. ఐక్యతతోనే వికసిత్ భారత్‌ను సాధించగలం. సమాజంలోని అన్ని వర్గాలు కలిసొస్తే దేశం ఉన్నత స్థాయికి చేరుతుంది" అని అన్నారు. "ఈ మఠం శతాబ్దాలుగా సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేసింది. ప్రతికూల పరిస్థితుల్లో ప్రజలకు ఆశ్రయం కల్పించింది. దేవాలయాలు, ఆశ్రయాల సంస్థాపన ద్వారా మానవత్వాన్ని కాపాడింది. విద్య నుంచి వృద్ధుల సంరక్షణ వరకు, పేదల సేవ వరకు మఠం ప్రజాహిత సేవల్లో ముందుంది" అని మోదీ కొనియాడారు. గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ రూపొందించిన ప్రసిద్ధ శిల్పి రామ్ సుతార్ రూపకల్పనలో ఈ 77 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహం నిర్మించబడింది.

## డిసెంబరు 4,5 తేదీల్లో పుతిన్ భారత పర్యటన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబరు 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. పుతిన్ నేతృత్వంలోని రష్యా ప్రతినిధి బృందం 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటుందని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ద్వైపాక్షిక సంబం ధాల్లో పురోగతిని సమీక్షించేందుకు ఇరు దేశాల నాయకత్వానికి ఈ పర్యటన ఒక అవకాశాన్ని కల్పిస్తోందని విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. అలాగే ఇప్పటికే ఇరు దేశాల మధ్య వున్న ప్రత్యేక, విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు దార్శనికతను నిర్ధారిం చడం, పరస్పర ఆసక్తి కలిగిన అంశాలతో పాటూ ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై పరస్ప రం అభిప్రాయాల మార్పిడికి కూడా ఈ పర్య టన దోహదపడుతుందని పేర్కొంది. 2021 లో జరిగిన 21వ వార్షిక సదస్సుకు పుతిన్ హాజరయ్యారు. ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములతో చర్చలు జరుపు తారు. 28 పాయింట్లతో ఉక్రెయిన్-రష్యా శాంతి ప్రణాళికను ట్రంప్ వెలువరించిన నేపథ్యంలో పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

# పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం

- హైకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కుల సంఘాలు వేర్వేరుగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. శుక్రవారం వారి పిటిషన్లపై చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సర్కార్ విడుదల చేసిన జీవో నెం.46పై ఈ దశలో తాము స్టే ఇవ్వలేమని స్పష్టం చేశారు. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలనీ కోరుకుంటున్నారా? పిటీషనర్‌కు హైకోర్టు ప్రశ్న వేసింది. నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఎలక్షన్ కమిషన్ తరఫు అడ్వకేట్ తన వాదనలు వినిపించారు. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని మేమే చెప్పాం కదా? అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్‌ఎంసీ ఎన్నికలను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది గుర్తు చేశారు. ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. "మేమే ఎన్నికలు నిర్వహించమని ఆదేశించి.. మేమే స్టే ఎలా ఇస్తాం' అంటూ ప్రశ్నించింది. డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్‌ను బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది కోరగా.. ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తెలిపింది. సబ్ క్యాటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 6 వారాలోపు కౌంటర్ దాఖలు చేయాలన్న కోర్టు.. తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది.

# కోకాపేట్ ఈ-వేలంలో రికార్డు

- ఎకరానికి రూ.151.25 కోట్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కోకాపేట్ నియోపోలిస్ భూముల రెండో విడత ఈ-వేలం శుక్రవారం ముగిసింది. ఈసారి ఎకరానికి పలికిన ధర రికార్డులు బద్దలుకొట్టింది. ప్లాట్ నెంబర్ 15కు ఎకరానికి రూ.151 కోట్లు 25 లక్షలు పలకగా, ప్లాట్ నెంబర్ 16కు రూ.147 కోట్లు 75 లక్షలు పలికింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇప్పటివరకు లేని స్థాయిలో బిడ్లు నమోదయ్యాయి.

హెచ్‌ఎండీఏ తెలిపిన వివరాల ప్రకారం, రెండో విడతలో 9.06 ఎకరాలను వేలం వేయగా మొత్తం రూ.1,353 కోట్ల 52 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో ప్లాట్ నెంబర్ 15లోని 4.03 ఎకరాలకు రూ.609 కోట్లు 55 లక్షలు, ప్లాట్ నెంబర్ 16లోని 5.03 ఎకరాలకు రూ.743 కోట్లు అందినట్లు అధికారులు వెల్లడించారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత ఈ-వేలంలో ఎకరానికి రూ.137.25 కోట్లు పలికిన విషయం తెలిసిందే. పెరుగుతున్న బిడ్లతో కోకాపేట్ రియల్ ఎస్టేట్‌కు కొత్త శకంగా అభివర్ణిస్తున్నారు.

**మిగిలిన ప్లాట్లు డిసెంబర్ 3, 5న వేలం**

కోకాపేట్ నియోపోలిస్‌లోని 29 ఎకరాలు, మూసాపేట్‌లోని 16 ఎకరాలకు డిసెంబర్ 3, 5 తేదీలలో వేలం జరగనుంది. ప్రారంభ ధరలను హెచ్‌ఎండీఏ ఇలా నిర్ణయించింది:

కోకాపేట్ నియోపోలిస్ – ఎకరానికి రూ.99 కోట్లు

కోకాపేట్ గోల్డెన్ మైల్ – ఎకరానికి రూ.70 కోట్లు

# పంచాయతీ ఎన్నికలకు గుర్తులు విడుదల

- బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థి పేరు, చిహ్నం...
- సర్పంచ్‌లకు 30, వార్డుమెంబర్లకు 20 గుర్తులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆరున్నరేళ్ల తర్వాత తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచి ఎన్నికలు పార్టీ రహిత పద్ధతిలో జరుగుతున్న కారణంగా అభ్యర్థులకు సాధారణంగా గ్రామీణ ప్రజలకు తెలిసిన గుర్తులనే రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించింది. సర్పంచి పదవికి 30 గుర్తులు, వార్డు సభ్యుల కోసం 20 గుర్తులు ముద్రించబడ్డాయి. సర్పంచి బ్యాలెట్ పత్రం గులాబీ రంగులో, వార్డు సభ్యులది తెలుపు రంగులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు.

**సర్పంచి ఎన్నికల కోసం కేటాయించిన గుర్తులు**

ఉంగరం, కత్తెర, బ్యాట్, టూత్‌పేస్ట్, స్పానర్, చెత్త డబ్బా, ఫుట్‌బాల్, లేడీ పర్స్, టీవీ రిమోట్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి, పడవ, నల్లబోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్‌హ్యాండిల్, టీజల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బిస్కట్, వేణువు, చెయిన్, చెప్పులు, గాలిబుడగ, స్టంప్స్.

**వార్డు సభ్యుల గుర్తులు**

గౌను, కటింగ్ ప్లేయర్, గ్యాస్‌స్టౌవ్, సిలిండర్, స్టూల్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటెన్నా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టు డబ్బా, కవరు, హాకీ స్టిక్-బంతి, నెక్‌టై, పెట్టె, విద్యుత్ స్తంభం, కెటిల్.


ఓటర్లకు ఎంపిక స్వేచ్ఛను ఇవ్వడం కోసం బ్యాలెట్ పత్రాల్లో చివరన NOTA (ఎవరూ నచ్చనప్పుడు) ఎంపికను కూడా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

ఓటర్ల సౌలభ్యం కోసం Te-poll మొబైల్ యాప్ ద్వారా ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ యాప్‌లో ఫిర్యాదుల నమోదు, పరిష్కార వివరాల ట్రాకింగ్ సౌకర్యాలు కూడా లభిస్తాయని అధికారులు తెలిపారు.

ఇక రిజర్వేషన్లపై కోర్టుల్లో పలు కేసులు పెండింగ్‌లో ఉండటంతో పంచాయతీరాజ్ శాఖలో ప్రత్యేక న్యాయ విభాగం ఏర్పాటైంది. బలవంతపు ఏకగ్రీవాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. గ్రామాల్లో సర్పంచి పదవులపై బహిరంగ వేలం మరియు ఒత్తిడితో ఏకగ్రీవాలు జరిగే ప్రయత్నాలపై ఇప్పటికే నిఘా ఉంచినట్లు సమాచారం.

# విత్తనాల సర్టిఫికేషన్ హక్కు రాష్ట్రాలదే కావాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రాల అధికారం కేంద్రీకరించే విధంగా బిల్లు ముసాయిదా సిద్ధమైన విధానాన్ని ఆయన ఖండించారు. ఇది భారత సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విత్తనాల ధృవీకరణ, నియంత్రణ విషయంలో పూర్తిస్థాయి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు.

"నకిలీ విత్తనాల రవాణా, అమ్మకాలను అడ్డుకోవాలంటే అధికారాలు రాష్ట్రాలకే ఉండాలి. లేకపోతే రైతుల రక్షణ అసాధ్యం" అని తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు.

అదే సమయంలో పంట నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం ఎవరు ఇస్తారు, ఏ విధంగా అందిస్తారు అన్న విషయంలో బిల్లులో స్పష్టత లేకపోవడాన్ని మంత్రి గట్టిగా విమర్శించారు. ఈ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం తరపున కఠిన అభ్యంతరాలు, వివరమైన సవరణల సూచనలు పంపేందుకు అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను నమోదు చేసి కేంద్రానికి పంపాలని సూచించారు. రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణుల సలహాల ఆధారంగానే సవరణలు జరగాలని తుమ్మల స్పష్టం చేశారు. "తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర హక్కుల విషయంలో రాజీ పడదు. ఈ విత్తన బిల్లుపై మా అభ్యంతరాలను గట్టిగా తెలియజేస్తాం" అని మంత్రి తుమ్మల హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ఈ అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గబోదన్న సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చింది.

# మెట్రో ప్రయాణికులకు 'స్మార్ట్ లాకర్' సేవలు

**తొలి విడతగా 7 ప్రధాన స్టేషన్లలో సేవలు అందుబాటులోకి..**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ మరో కీలక ముందడుగు వేసింది. డిజిటల్ క్లాక్‌రూమ్ సేవల సంస్థ 'టక్కీట్'తో భాగస్వామ్యం కుదుర్చుకుని, నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో 'ఆన్-డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్ లాకర్ల' సేవలను ప్రారంభించింది. ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఇకపై ప్రయాణికులు తమ హెల్మెట్లు, లగేజీ, షాపింగ్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు, ఇతర వ్యక్తిగత వస్తువులను వెంట మోసుకెళ్ళే ఇబ్బంది లేకుండా, మెట్రో స్టేషన్లలోని ఈ లాకర్లలో సురక్షితంగా భద్రపరచు కోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు ఎలాంటి లగేజీ భారం లేకుండా స్వేచ్ఛగా నగరంలో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.

టక్కీట్ స్మార్ట్ లాకర్లు అత్యాధునిక సాంకేతికతతో "స్కాన్ అండ్ స్టోర్" విధానంలో పనిచేస్తాయి. కేవలం మూడు సులభమైన దశల ద్వారా 30 సెకన్లలోపు ప్రయాణికులు తమ వస్తువులను భద్రపరచుకోవచ్చు. లాకర్ ప్యానెల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. వస్తువుల పరిమాణాన్ని బట్టి లాకర్ సైజును ఎంచుకోవాలి. అవసరమైన సమయానికి తగిన డబ్బును డిజిటల్ పద్ధతిలో చెల్లించాలి.

ఈ సందర్భంగా ఎల్ అండ్ టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండీ, సీఈఓ కెవిబి రెడ్డి మాట్లాడుతూ టక్కీట్‌తో భాగస్వామ్యం ద్వారా స్టేషన్లలో స్మార్ట్, సురక్షితమైన స్టోరేజ్ పరిష్కారాలను తీసుకువచ్చామనీ తెలిపారు. ఇది ప్రయాణికుల రోజువారీ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తుందన్నారు. మెట్రో స్టేషన్లను బహుళ-యుటిలిటీ హబ్‌లుగా మార్చే దిశగా ఇదొక ముందడుగు అని పేర్కొన్నారు. అలాగే టక్కీట్ వ్యవస్థాపకుడు రాజేష్ అమర్‌లాల్ మాట్లాడుతూ పట్టణ రవాణాలో ప్రయాణికులకు అత్యంత అవసరమైన చోట తమ సేవలను అందించడమే లక్ష్యమన్నారు. మియాపూర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎల్బీనగర్ ఉప్పల్ పెరేడ్ గ్రౌండ్, హైటెక్ సిటీ మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్లు అందుబాటులోకి వచ్చాయి.

# కేసీఆర్ దీక్ష ఓ నాటకం




- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్‌ఎస్ చేపట్టనున్న 'దీక్షా దివాస్'పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని, ఇప్పుడు రాజకీయ ఉనికి కోసం మళ్లీ అదే సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక నాటకమని, దాని వెనుక నిజాలు ప్రజలకు తెలుసునన్నారు. కేవలం మూడు రోజుల్లోనే కేసీఆర్ దీక్ష విరమించడం, విద్యార్థి సంఘాలు దీనిపై వ్యక్తం చేసిన అసహనం గురించి గుర్తుచేశారు. కేవలం కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ సాధ్యం కాలేదని, ఇందుకు సోనియా గాంధీ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు చేసిన ఉద్యమ దీక్షతో కేసీఆర్ దీక్షను పోల్చడమే సరైందికాదన్నారు. ఉద్యమ సమయంలో పేదలు, విద్యార్థులు, ఎస్సీ-ఎస్టీలు చేసిన త్యాగాలే తెలంగాణ రాష్ట్ర హక్కు సాధనకు దారితీశాయని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం ఉద్యమంలో ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కోలేదని, మరోవైపు పేదలు ప్రాణత్యాగాలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ సమయంలో కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకు అగ్గిపెట్టె ఎందుకు దొరకలేదో ప్రజలు ప్రశ్నిస్తారన్నారు.

పేదల త్యాగాలతో వచ్చిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం పదేళ్లపాటు వినియోగించుకుందనే ఆరోపణలు కూడా మహేష్ గౌడ్ చేశారు. సోనియా గాంధీ చొరవ లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదికాదని, అలా ఏర్పడకపోతే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితే ఉండేదికాదని వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ దీక్ష ఒక చరిత్ర




- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై అవాకులు-చవాకులు పేలినా ఆయన చరిత్ర తారుమారుకాదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన దీక్షే తెలంగాణ ఉద్యమానికి మలుపుతిప్పిందని, అది చరిత్రలో నిలిచిపోయే సంఘటన అని పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో దీక్ష దీవస్ ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. కేసీఆర్ దీక్షపై కొంతమంది అర్థం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన తలసాని, "కొత్త బిచ్చగాళ్లు పొద్దు ఎరగరు అన్నట్లుగా కొన్ని రాజకీయ నేతలు వ్యాఖ్యలతో దూసుకొస్తున్నారు" అని వ్యంగ్యంగా అన్నారు. ప్రత్యేక రాష్ట్రం లేకుంటే కాంగ్రెస్ పార్టీకి, ప్రస్తుత ప్రభుత్వ నాయకులకు ఎక్కడ పదవులు ఉండేవని ప్రశ్నించారు. బతుకమ్మ పేరిట తమ ప్రభుత్వ కాలంలో పంపిన చీరలను ఇప్పుడు 'ఇందిరమ్మ చీరలు'గా పేరు మార్చుకోవడం రాజకీయ అనైతికత అని విమర్శించారు. "ఈ చీరలు పంపిణీకి కేసీఆర్ పేరు పెట్టుకోలేదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు తమకే క్రెడిట్ తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు" అని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో 'కేసీఆర్ దీక్షా దివాస్'ను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించిన తలసాని, తెలంగాణ చరిత్ర తెలియని వారే ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయంలో ఇప్పుడు మాట్లాడుతున్నవారు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. "కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధించకుంటే, ఈ రోజు ఈ నేతలకు పదవులు ఎక్కడివి? సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని అసెంబ్లీలోనే కేసీఆర్ ప్రకటించారు. అలాంటి విషయాల్లో మూరు?లా మాట్లాడడం మా బలం కాదు" అని తలసాని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు.




## పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలి

- ప్లాస్టిక్ ను వినియోగించవద్దు
- సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల గీతానగర్ జడ్పీ హైస్కూల్లో జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



విద్యార్థులు పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వికసిత్, ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా పాఠశాలల విద్యార్థుల జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాజ్య స్థరీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్ఎస్ బీవీపీ) శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ను పరిశీలించి, ఎలా తయారు చేశారు? వాటి వినియోగం, వచ్చే ఫలితాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని సూచించారు. ప్రయోగాలతోనే ఆ పాఠ్యాంశంపై మంచి అవగాహన వస్తుందని, అది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ప్రయోగాలు చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సౌర విద్యుత్, పవన విద్యుత్, థర్మో డైనమిక్స్, కిరణజన్య సంయోగ క్రియ తదితర అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. సైన్స్ మ్యూజియం కోసం కావలసిన స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని, వివిధ సైన్స్ పరికరాలపై విద్యార్థులకు అవగాహన వచ్చేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ స్కూల్‌లో ఆరోగ్య శిబిరం

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సందర్శించి, పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. పిల్లలకు నోటి పరిశుభ్రత, హ్యాండ్ వాష్ టెక్నిక్, చలికాలంలో వచ్చే నిమోనియా, అస్తమా, ఎలర్జీకి సంబంధించిన వ్యాధులపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ హాస్టల్ ను సందర్శించి, పిల్లలకు పరిశుభ్రమైన పోషకాహారాన్ని, వేడి వేడి గా ఎప్పటికప్పుడు అందించాలని వార్డెన్ కి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్, సూపర్వైజర్ టి. హేమలత, ఎస్.ఓ లింగవ్వ ,సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ ఆరోగ్య కార్యకర్త ప్రసన్న, ఆశా కార్యకర్త లత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కేసిఆర్, కేటీఆర్ లను విమర్శించే స్థాయి లేదు

- బీఆర్ఎస్ యూత్ నాయకులు

**బలగం టీవీ, వేములవాడ**



కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ మరియు బిఆర్ఎస్? వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ లను విమర్శించే స్థాయి లేదని బిఆర్ఎస్ యూత్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. నిన్నటి రోజున కాంగ్రెస్ నాయకులు తమ నాయకులపై రౌడీల్లాగా మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామని బిఆర్ఎస్ యూత్ నాయకులు పోతు ఆనీల్, మంతె సందీప్, సయ్యద్ ఉమర్, ఆంజత్ పాషా, రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీరు చోటా మోటా నాయకులని, ప్రజా క్షేత్రంలో కౌన్సిలర్లుగా కూడా గెలవలేరని బిఆర్ఎస్ యూత్ నాయకులు విమర్శించారు. ఇక్కడ 10 యేండ్లు పార్టీలో ఉండి పార్టి ద్వారా లబ్ది పోంది,పదవులు పోందిన నాయకులు మమ్మల్ని విమర్శిస్తుంటే ఊసరవెల్లి కూడా మిమ్మల్ని చూసి సిగ్గుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి రఫీ, మేడిపల్లి రాజు, సుంకపాక దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి..

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారంలో భాగంగా చేసే వ్యయం వివరాల నమోదు పై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సహాయ వ్యయ పరిశీలకులకు (ఏ. ఈ. ఓ)లకు శిక్షణ ఇవ్వగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్, నోడల్ అధికారి శేషాద్రి తో కలిసి మాట్లాడారు.

ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సర్పంచ్, వార్డు సభ్యులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 2,50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ.1,50, 000 అని వెల్లడించారు. అలాగే 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ.30,000 అని తెలిపారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్ళవద్దని వెల్లడించారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణలో డీపీఓ షరీఫుద్దిన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం మొదటి విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీఓ షరీఫుద్దిన్, ఏవో రాంరెడ్డి, ఈడీఎం శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లెల్ల చెక్ పోస్ట్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ఈరోజు ఆకస్మిక తనిఖీ చేసి వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు,ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించందంతో పాటు,వాహనాలను క్షుణ్ణముగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు.





ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వెంట సి.ఐ మొగిలి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ కాదు, డబుల్ కష్టాలు

- సిరిసిల్ల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తీవ్ర నీటి కష్టాలు
- బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్
- బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల పెద్దూరు డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై బీజేపీ తరఫున శుక్రవారంతీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజల ప్రాథమిక అవసరమైన నీటిని కూడా ప్రభుత్వం అందించలేకపోవడంపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీని ప్రత్యక్షంగా సందర్శించిన బీజేపీ బృందం, స్థానిక మహిళలు, వృద్ధులు, పిల్లలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.కాలనీలో మిషన్ భగీరథ నీరు నాలుగు లేదా ఐదు రోజులకు ఒకసారి మాత్రమే వస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు ప్రతి పనికీపిల్లల పాఠశాల, రోజువారీ వంటలు, శుభ్రతుఅన్నింటికీ నీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన చెందారు. మున్సిపాలిటీకి, కలెక్టర్ కి పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతోందని %దీజ్రీ% నేతలు ధ్వజమెత్తారు.

ఎంపీ ఇచ్చిన బోర్లు సైతం కేవలం గ్రౌండ్ ఫ్లోర్ వరకు మాత్రమే నీటిని అందించగలుగుతున్నాయి. జీ+2 (రెండు అంతస్తుల) ఇళ్లకు మిషన్ భగీరథే ఏకైక మార్గంగా ఉన్నప్పటికీ, రోజువారీగా నీళ్ల వదలకుండా ప్రజలను ప్రభుత్వం బాధ పెడుతోందని దుమాల శ్రీకాంత్ విమర్శించారు. పేద ప్రజలకు ఇళ్ల నిర్మించి ఇచ్చిన ప్రభుత్వం, నీటి వంటి ప్రాథమిక అవసరం తీర్చకుండా వారికి నరకం చూపిస్తోందని దుమాల శ్రీకాంత్ మండిపడ్డారు. "మాటల్లో 'డబుల్ బెడ్‌రూమ్' అని గొప్పలు చెప్పుకుంటూ%ౌ% వాస్తవానికి మాత్రం ప్రజలకు 'డబుల్ ఇబ్బందులు, డబుల్ కష్టాలు' సృష్టిస్తోంది" అని అన్నారు. తక్షణమే మిషన్ భగీరథ నీళు ప్రతిరోజు వదలాలి, నీటి ఎద్దడిని వెంటనే, పూర్తిగా పరిష్కరించాలి, పెద్దూరు కాలనీకి నీరు చేరేలా తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చారించారు. తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే, ప్రజలందరితో కలిసి భారీ స్థాయిలో ఉద్యమం ప్రారంభిస్తామని, మున్సిపాలిటీని ముట్టడిస్తామని దుమాల శ్రీకాంత్ హెచ్చరించారు. ప్రజల కోసం బీజేపీ ఏమి చేయగలదో ప్రభుత్వం గట్టిగా అనుభవించేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పెద్దూరు ప్రజల సమస్యను తమ సమస్యగా భావించి పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దుమాల శ్రీకాంత్‌తో పాటు సూరం వినయ్, రచ్చ రాహుల్, దేవరాజు, కొంపెల్లి విజయ్, అబి, డబుల్ బెడ్‌రూమ్ మహిళలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'అమా నీ వెంట నేనస్తున్నా!'



- **తల్లి మృతిని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. మానేరువాగులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకోగా, ఆ దుఃఖాన్ని తట్టుకోలేక కొడుకు కూడా అదే వాగులో దూకి బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. తల్లి, కొడుకుల మృతితో తంగళ్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత (భర్త దేవరాజు) దంపతులకు కుమారుడు అభిలాష్ (33), కూతుర్లు మౌనిక, మానస ఉన్నారు. ఇద్దరు కూతుర్లకు వివాహాలు జరిగాయి. అయితే, ఎనిమిదేళ్ల క్రితం లలిత భర్త దేవరాజు మురికి కాలువలో పడి మృతి చెందారు. కొడుకు అభిలాష్ 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి, ప్రస్తుతం 17వ పోలిస్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తువీన్నాడు. అభిలాష్‌కు వివాహం చేయడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. భర్త మరణించినప్పటి నుంచి లలిత కొంత అనారోగ్యంతో బాధపడుతున్నారు.

**తల్లి ఆత్మహత్య.. కొడుకు బలవన్మరణం**

గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన లలిత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతలో, శుక్రవారం ఉదయం సిరిసిల్ల మానేరువాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయగా, అది మంచికట్ల లలితగా గుర్తించారు. తల్లి లలిత మృతదేహాన్ని చూసిన కొడుకు అభిలాష్ తీవ్రంగా విలపించాడు. పోలీసులు, స్థానికులు అందరూ చూస్తుండగానే, తీవ్ర ఆవేదనకు లోనైన అభిలాష్ ఒక్కసారిగా మానేరువాగులో దూకాడు. అక్కడ ఉన్నవారిలో ఎవరికీ ఈత రాకపోవడంతో అభిలాష్‌ను కాపాడే ప్రయత్నం ఫలించలేదు. తల్లి మృతిని తట్టుకోలేకే కొడుకు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు తల్లి లలిత, కొడుకు అభిలాష్ మృతదేహాలను వెలికి తీసి, సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే రోజు తల్లి, కొడుకు ఇద్దరూ మృతి చెందడంతో తంగళ్లపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలపై డిసెంబర్ 3న మహా ధర్నా..

- **జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా టీయూడబ్ల్యూజే ఆందోళన కార్యక్రమం..**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణికి నిరసనగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) పోరాటానికి సిద్ధమైంది. ఈ మేరకు, డిసెంబర్ 3వ తేదీన ఉదయం 10 గంటలకు మాసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించాలని యూనియన్ నిర్ణయించింది. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సంయుక్తంగా ఈ ధర్నాకు పిలుపునిస్తూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేట్/నేషనల్ కౌన్సిల్ సభ్యులకు లేఖ విడుదల చేశారు.

ఈ సందర్భంగా లేఖలో పేర్కొన్న వివరాలు.. జర్నలిస్టులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన అక్రెడిటేషన్లను ప్రభుత్వం గత 20 నెలలుగా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని యూనియన్ నేతలు ఆరోపించారు. పాత అక్రెడిటేషన్ కార్డులనే రెన్యూవల్ చేస్తున్నారే తప్ప, కొత్త కార్డులు ఇవ్వడం లేదని, దీనిపై అడిగితే 'ఇదిగో, అదిగో' అంటూ వాయిదాలు వేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందని పరిస్థితి నెలకొందని, ఇళ్ల స్థలాల అంశం కూడా అందని ద్రాక్షలా మిగిలిపోయిందని నేతలు తమ లేఖలో తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ప్రతినిధి బృందం ఇప్పటికే పలుమార్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి చర్చించడంతో పాటు వినతి పత్రాలను కూడా సమర్పించింది. అయినప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ సాచివేత ధోరణికి తమ ధర్మాగ్రహాన్ని తెలియజేయడానికి ఈ మహా ధర్నా అతి ముఖ్యమైనదని టీయూడబ్ల్యూజే నాయకత్వం ప్రకటించింది. జిల్లా నుంచి ముఖ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్లాన్ చేసుకొని మాకు తెలియజేయాలని కోరుతున్నామని తెలిపారు. అలాగే, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులు తప్పకుండా ఈ ధర్నాలో పాల్గొనాలని యూనియన్ ఆదేశించింది.

# ఆటో కార్మిక నాయకుల ఆధ్వర్యంలో కేటీఆర్ చిత్రపటానికి పాలభిషేకం

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ తెలంగాణ తల్లి వద్ద ఆటో యూనియన్ నాయకులు సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో కేటీఆర్ గారు రాజన్న సిరిసిల్ల వ్యాప్తంగా ఉన్నటువంటి 5000 ఆటో డ్రైవర్ల కు ఉచిత ప్రమాద బీమా 5లక్షల భీమా కు తన సొంత డబ్బులతో చేయిస్తున్నందుకు వేములవాడ పట్టణంలోని ఆటో కార్మిక నాయకులు మరియు డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ కెటిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్,సిరిగిరి చందు జోగినీ శంకరులు వారికి మద్దతుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు వల్ల ఇప్పటివరకు 200 మంది ఆటో డ్రైవర్లు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను అధికారంలోకి రావడానికి వాడుకుందని ఎలక్షన్ మేనిఫెస్టోలో ప్రతినెలా 1000 రూపాయలు చొప్పున ఆటో డ్రైవర్లకు జీతభత్యం ఇస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు.ఒక్కొక్క ఆటో డ్రైవర్ కి 24 వేల రూపాయలు రేవంత్ సర్కార్ బాకీ ఉందని విమర్శించారు.రెక్క ఆడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఆటో డ్రైవర్లు ఉన్నారని వాపోయారు పిల్లల చదువులకు రోజు పూట గడవడానికి ఇబ్బంది ఉందని ఫ్రీ బస్సు వల్ల రోజు రోజుకి అన్యాయానికి గురవుతున్నామని ఉపాధి కోల్పోతున్నామని తమ బాధను ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోని ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు గతంలో ఆటో డ్రైవర్లకు రోడ్ టాక్స్ బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని కొనియాడారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నటువంటి అటో డైవర్లకు కూడా పార్టీ లకు ఆతితంగా ఉచిత ప్రమాద బీమా నమోదు చేయిస్తామని తెలిపారు మా కుటుంబాలకు భరోసానిచ్చినటువంటి బీఆర్ఎస్ పార్టికి,మాజీ మంత్రి కేటీఆర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజద్ పాషా,మహ్మద్ రఫీ,ఎండి వకీల్,మేడిపల్లి రాజు,బొజ్జ సుకుమార్, జావీద్,మిఠాయి శంకరయ్య,బోడిగే దుర్గయ్య,పెంట రాజేష్, అలీ షేక్, అబ్జల్ పాషా రుద్రారం లింగయ్య,సుంకపాక దేవరాజు,నవీన్ సుంకపాక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.







# పంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్ట్ లు ఏర్పాటు..

- **చెక్ పోస్ట్ ల వద్ద 24/7 అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో 06 చెక్ పోస్ట్ లు తంగళ్ళపల్లి (జిల్లెళ్ల), గంభీరావుపేట్ (పెద్దమ్మ), ముస్తాబాద్ (వెంకట్రావ్ పల్లి), వేములవాడరూరల్ (ఫజుల్ నగర్), బోయినిపల్లి (నర్సింగపూర్), రుద్రంగి (మానాల క్రాస్ రోడ్) లు ఏర్పాటు చేసి మద్యం, డబ్బు ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. గురువారం రోజున బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసి చెక్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి మద్యం,డబ్బు సరఫరా కాకుండా జిల్లాలో సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెక్ పోస్ట్ ల వద్ద విధులలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ మద్యం,డబ్బు రవాణా అడ్డుకట్ట వేయాలని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని, తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లినట్లయితే సీజ్ చేయాలని, అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం,పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బులను తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమమని, ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# యూట్యూబ్ ఇంటర్వ్యూతో పాత పలిగ రగిలి..

**మాజీ నక్సలైట్ దారుణ హత్య**





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ నక్సలైట్ హత్య కలకలం సృష్టించింది. తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన మాజీ నక్సలైట్ సిద్దయ్య అలియాస్ నర్సయ్య (50) ను వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని అగ్రహారం గుట్టల్లో బండరాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారు. ఈ హత్యకు గతంలో సిద్దయ్య ఇచ్చిన ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూ కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సిద్దయ్య అజ్ఞాతంలో ఉన్నప్పుడు తాను చేసిన హత్యల గురించి ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నట్లు సమాచారం. ఆ ఇంటర్వ్యూ ద్వారా తన తండ్రిని చంపింది సిద్దయ్యే అని తెలుసుకున్న జగిత్యాల జిల్లాకు చెందిన సంతోష్ అనే యువకుడు పగతో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. యూట్యూబ్ ఇంటర్వ్యూ పేరుతో సిద్దయ్యను అగ్రహారం గుట్టల్లోకి పిలిపించి, పథకం ప్రకారం సంతోష్ బండరాళ్లతో దాడి చేసి హతమార్చినట్లు సమాచారం. హత్య అనంతరం నిందితుడు సంతోష్ నేరుగా జగిత్యాల పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉత్తమ సహకార సంఘం చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి సన్మానం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ఉత్తమ సహకార సంఘం చైర్మన్‌గా అవార్డు అందుకున్న సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ని అపూర్వ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సహకార రంగంలో ఆయన చేసిన విశేష కృషికిగాను ఈ అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఫౌండేషన్ సభ్యులు ఆయనకు శాలువా కప్పి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన కృషిని గుర్తించి అవార్డు ఇచ్చినందుకు మరియు సన్మానించిన అపూర్వ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులు, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో అపూర్వ ఫౌండేషన్ సభ్యులు చక్కిలం మధు, శనిగరపు బాలరాజు, కొర్రి రమేష్, ఎల్లగందుల నరసింహులు, శ్రీనివాస్ రాము, తోట వేణు, శ్రీనివాస్ కోనేటి, సాయిలు, డీజే ప్రవీణ్, హసన్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటనకు సిద్ధం

**బలగం టీవీ, హైదరాబాద్**



అర్జెంటీనా లెజెండరీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ త్వరలో భారత పర్యటన చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌ను కూడా సందర్శించనున్నట్లు మెస్సీ స్వయంగా ధృవీకరించారు. ఈ మేరకు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తూ భారత ప్రజలు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న 'గోట్ టూర్'లో హైదరాబాద్ నగరాన్ని చేర్చడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.మెస్సీ భారతదేశంలో కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు హైదరాబాద్‌కూడా పర్యటించనున్నాడు.

**డిసెంబర్ 13న మెస్సీ హాజరు**

ప్రపంచ ఫుట్‌బాల్ ఐకాన్ మెస్సీ ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌కు రానున్నారు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమాచారం. మెస్సీ పర్యటనను స్వాగతిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ట్వీట్ చేశారు. ఫుట్‌బాల్ ప్రేమికులకు, హైదరాబాద్ నగరానికి ఇది ఆనందదాయకమైన విషయం అని పేర్కొన్నారు. మెస్సీకి ఘన స్వాగతం పలికేందుకు నగరం సిద్ధమైందని తెలిపారు.




## చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ సేవలకు కేంద్ర గుర్తింపు

- **ఎఫ్‌సీఆర్‌ఏ నమోదు మంజూరు**

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వేలాది మందికి ఆయన వ్యక్తిగతంగా అందించిన సహాయం తెలిసిందే. ఇదే సేవాస్ఫూర్తి నుంచి ఆవిర్భవించిన చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ గత 27 ఏళ్లుగా బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ సేవల ద్వారా అనేక మందికి పునర్జీవనం అందిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో కూడా ఈ ట్రస్ట్ కీలక సేవలు అందించి ప్రశంసలు పొందింది.

తాజాగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఎఫ్‌సీఆర్‌ఏ కింద ట్రస్ట్‌కి నమోదు అనుమతి మంజూరు చేసింది. దీని ద్వారా సంస్థ విదేశాల నుంచి కూడా విరాళాలు స్వీకరించే అవకాశాన్ని సొంతం చేసుకుంది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం%-%2010 ప్రకారం ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో ట్రస్ట్ చేసిన దరఖాస్తును పరిశీలించిన కేంద్రం అనుకూలంగా స్పందించింది.





## మంగ్లీపై అసభ్య వ్యాఖ్యలు.. అదుపులోకి నిందితుడు

- **ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రసిద్ధ ఫోక్ సింగర్ మంగ్లీపై సోషల్ మీడియాలో దూషణాత్మకంగా, అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల మంగ్లీ పాడిన 'బాయిలోనే బల్లి పలికే' పాట సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. అనేక మంది ఈ పాటకు రీల్స్ చేస్తూ ఎంజాయ్ చేస్తుండగా, ఒక వ్యక్తి మాత్రం ఆ పాటను ఆధారంగా తీసుకొని మంగ్లీపై అసభ్యకరంగా, కులదూషణకు దారితీసేలా వీడియో రూపొందించి పోస్ట్ చేశాడు. ఈ ఘటనపై ఆగ్రహించిన మంగ్లీ నేరుగా ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మహిళా గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం, షెడ్యూల్డ్ తెగలను అవమానించే రీతిలో వ్యాఖ్యలు చేయడం వంటి ఆరోపణలపై అతనిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

**"ఇలాంటి దూషణలు అస్సలు సహించను"- మంగ్లీ**

ఈ ఘటనపై స్పందించిన మంగ్లీ మాట్లాడుతూ, "నా పాటలు ప్రజలను అలరిస్తే నాకు అమిత ఆనందం. కానీ ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు వింటే చాలా బాధిస్తుంది. ఒక మహిళగా, ఇంకా ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తిగా ఇలాంటి దూషణలను నేను అస్సలు సహించను. చట్టంపై నాకు పూర్తిగా నమ్మకం ఉంది" అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరి గౌరవాన్ని దెబ్బతీసే కామెంట్లు చేసినా, ముఖ్యంగా మహిళలు మరియు గిరిజన వర్గాలను లక్ష్యంగా చేసుకుని దూషించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## విశ్వవిజేత టీమిండియా తొలి సిరీస్‌కు సన్నద్ధం

**బలగం టీవీ, హైదరాబాద్**



లటీ20 వరల్డ్‌కప్‌ను యాదిరంగా కైవసం చేసుకున్న భారత మహిళా క్రికెట్ జట్టు, టైటిల్ విజయానంతరం తొలి అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమవుతోంది. స్వదేశంలోనే ఈ సిరీస్ జరగనుండగా, ఉపఖండ ప్రత్యర్థి శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 పోరాటం నిర్వహించనున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం ప్రకటించింది. ఈ మ్యాచ్‌లకు రెండు నగరాలువిశాఖపట్టణం, తిరువనంతపురంవేదికలుగా ఎంపికయ్యాయి. వరల్డ్‌కప్ అనంతరం కోహెూస్ట్ దేశాలైన భారత్, శ్రీలంక తలపడుతున్న తొలి సిరీస్ ఇదే. డిసెంబర్ 21 నుంచి 30 వరకు ఐదు టీ20లు జరగనున్నాయి. జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనలో చివరిసారిగా టీ20 సిరీస్ ఆడిన భారత జట్టు 3%-%2తో విజేతగా నిలిచింది. మరోవైపు శ్రీలంక మార్చిలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో 1-1తో సమం చేసుకుంది.

**సిరీస్ షెడ్యూల్**

మొదటి టీ20-డిసెంబర్ 21, ఆదివారం - విశాఖపట్టణం

రెండో టీ20 -డిసెంబర్ 23, మంగళవారం - విశాఖపట్టణం

మూడో టీ20 - డిసెంబర్ 26, శుక్రవారం %-% తిరువనంతపురం

నాలుగో టీ20-డిసెంబర్ 28, ఆదివారం - తిరువనంతపురం

ఐదో టీ20 - డిసెంబర్ 30, మంగళవారం- తిరువనంతపురం

## ఉప్పల్ స్టేడియంలో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 మ్యాచ్‌లు




- **ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రతిష్టాత్మక సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో గ్రూప్-సీ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు పూర్తవగా, మరో పది మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌లను ప్రేక్షకులు ఉచితంగా వీక్షించే అవకాశాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కల్పించింది. ఈ అవకాశాన్ని క్రికెట్ అభిమానులు వినియోగించుకోవాలని హెచ్‌సీఏ సూచించింది.

స్టేడియంలోకి ప్రవేశం గేట్ నంబర్ 3 ద్వారా ఉచితంగా అందుబాటులో ఉంటుంది. నవంబర్ 26న టోర్నీ ఆరంభమై ఉప్పల్ వేదికగా నాలుగు మ్యాచ్‌లు ఇప్పటికే జరిగాయి. దేశవాళీ క్రికెటర్లతో పాటు వెటరన్ స్టార్ క్రికెటర్లు కూడా ఈ టోర్నీలో పాల్గొంటుండటం విశేషం. ముఖ్యంగా బరోడా జట్టులో హార్దిక్ పాండ్యా ఆడే అవకాశం ఉండటంతో ప్రేక్షకులకు అతన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఏర్పడనుంది.

ఉప్పల్ స్టేడియంలో నవంబర్ 30, డిసెంబర్ 2, 4, 6, 8 తేదీలలో ప్రతిరోజూ రెండు మ్యాచ్‌లు చొప్పున జరుగనున్నాయి. తొలి మ్యాచ్ ఉదయం 11 గంటలకు, రెండో మ్యాచ్ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది.

## పృథ్వీరాజ్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులు

- **మల్లికా సుకుమారన్ సంచలన ఆరోపణలు**

**బలగం టీవీ, హైదరాబాద్**



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌పై ఉద్దేశపూర్వకంగా సైబర్ దాడులు జరుగుతున్నాయని ఆయన తల్లి, సీనియర్ నటి మల్లికా సుకుమారన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక నటుడిగా తన కొడుకును సినీ పరిశ్రమ నుంచి తొలగించాలనే లక్ష్యంతో పెద్ద స్థాయిలో కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మలయాళ మీడియాలో ఇచ్చిన ఇంటర్వ్యూలో మల్లికా సుకుమారన్ మాట్లాడుతూ, "పృథ్వీరాజ్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఇది పూర్తిగా ప్రణాళికా బద్ధంగా జరుగుతున్న దాడి. అతడిని పరిశ్రమలో నిలదీయకుండా చేయడం ఈ కుట్రల ముఖ్య ఉద్దేశ్యం" అని అన్నారు.

నవంబర్ 21న విడుదలైన పృథ్వీరాజ్ తాజా చిత్రం 'విలాయత్ బుద్ధ' విడుదలైనప్పటి నుంచి ఒక గ్రూప్ కావాలనే నెగటివ్ ప్రచారం ముమ్మరం చేసిందని మల్లికా ఆరోపించారు. జయన్ నంబియార్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ తర్వాత పృథ్వీరాజ్‌పై సైబర్ దాడులు మరింత పెరిగినట్లు ఆమె పేర్కొన్నారు. కేవలం వృత్తిపరంగానే కాదు, వ్యక్తిగత అంశాలను కూడా లక్ష్యంగా చేస్తూ దాడులు జరుగుతున్నాయని, ఇది తట్టుకోలేని పరిస్థితి అని ఆమె వాపోయారు.

మల్లికా సుకుమారన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పృథ్వీరాజ్‌పై జరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో ఈ ఆరోపణలు మరింత దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## ఓటీటీలోకి వచ్చిన 'మాస్ జాతర'

- **నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభం**

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ, శ్రీలీల జంటగా నటించిన 'మాస్ జాతర' చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చింది. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. థియేటర్లలో పెద్దగా స్పందన రానప్పటికీ, రవితేజ నటన మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజా సమాచారం ప్రకారం 'మాస్ జాతర' ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. నవంబర్ 28 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. రవితేజ%-%శ్రీలీల జంటగా వచ్చిన రెండో సినిమా ఇదే. ఇంతకుముందు ఈ జోడీ 2022లో విడుదలైన 'ధమాకా'తో భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఆ చిత్రంతో రవితేజ రూ.100 కోట్లు క్లబ్‌లోకి ప్రవేశించారు.'మాస్ జాతర' థియేటర్లలో రూ.17.15 కోట్ల వరకూ వసూళ్లు సాధించింది. ఇప్పుడు ఓటీటీ ద్వారా విస్తృతంగా ప్రేక్షకులను చేరుకుంటోంది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు విడుదలైంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర ప్రతినాయకుడిగా నటించగా, రాజేంద్ర ప్రసాద్, సముద్రఖని, తారక్ పొన్నప్ప, హైపర్ ఆది కీలక పాత్రల్లో నటించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లు ఈ చిత్రాన్ని నిర్మించగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.